


# ఎగిరిపోయిన పక్షి

-బమ్మిడి జగదీశ్వరరావు

ఎక్కడో సైబీరియా నుంచి దేశ దేశాలు దాటివచ్చి భారతదేశంలోని ఒక మారు మూల గ్రామమైన తేలి నీలాపురంలో కాపురముండే 'పెలికాన్', 'పెయింటెంగ్ స్టార్క్స్' స్వేచ్ఛాజీవితానికో ఆదర్శం!

ఆ పక్షుల్లా తను ఎన్ని ఆమడలైనా ఎగిరివెళ్ళలేదూ!? వెళ్తే 'లేచిపోవడం' అంటారేమో?! అయినా అంతా 'లేచిపోవడానికే 'స్వేచ్ఛ' నిస్తున్నారు! వివాహానికి అంగీకరించనివాళ్ళు- లేచిపోవడానికే అంగీకరించడం మానవ జీవితంలో ఎంత ఆశ్చర్యం?!!

ఈ కాలం ఆడపిల్లలకు వివాహ స్వాతంత్ర్యం కూడాలేదు! ఆ మాటకొస్తే ఆ కాలం కన్యలకూ, రాజకన్యలకూ వివాహ స్వతంత్ర్యం వున్నట్లుంది! అప్పుడు నచ్చిన వారి మెడలో వేసే దండ తమ చేతులకు ఇప్పుడు సంకెళ్ళవుతున్నాయి!

* * *

"సులోచనా ఇదిగో వుత్తరం... రఘురాం ఇచ్చాడు....." అన్నయ్య తల వంచుకొని చెయ్యి చాపాడు నే తల వంచుకోవాల్సింది పోయి తల ఎత్తుకు ఉత్తరాన్ని అందుకున్నాను. పెళ్ళయిన చెల్లెలికి. భర్త పోయిన చెల్లెలికి..... ఓ పరాయి మగాడి నుండి ఉత్తరం తీసుకొచ్చి ఇచ్చినందుకేమో సిగ్గుపడుతున్నాడు. తల దించుకొన్నాడు. ముఖం చూపించలేక వెళ్ళిపోతున్నాడు.

నేను అరుగుదాటుతుంటే వదినలిద్దరూ పెదవి విప్పలేదు. చిన్నన్నయ్య చేతులు నులుముకుంటుంటే, పెద్దన్నయ్య తన గదిలోకి వెళ్ళి తలుపువేసుకున్నాడు. అల్పపీడనం తెరిపి ఇచ్చిందికాని, పెనుగాలులు ఎప్పుడు వీస్తాయో... ఏమో?!.....

టూరిస్టు బంగళాకు వెళ్ళేసరికి రఘురాం లేడు. హెల్త్‌సూపర్‌వైజర్ వస్తే ఊర్లోకి వెళ్ళాడట. అక్కడ కూర్చోకుండా రోడ్డుమీదకు వచ్చి ముందుకు కదిలాను. ఆకాశం నిండా పెలికాన్స్ ఇంద్రధనస్సుల వెల్లువలా వెల్లివిరిసి, మబ్బుల్లా కదిలి చింత చెట్లమీద, సర్కారు తుమ్మ చెట్లమీద..... ఈ ప్రపంచమంతా వాటిదే అన్నట్లు.... గూళ్ళు నిర్మించుకుంటున్నాయి. కాపురాల్ని పండిస్తున్నాయి. గుడ్లు పెడుతున్నాయి..... పొదుగుతున్నాయి..... పొదిగిన పిల్లలకి ఆహారంగా సముద్ర తీరం నుంచి మెలకువగా పెద్ద పెద్ద చేపల్ని తెస్తున్నాయి..... జారి నేలకు పడ్డ ఆహారాన్ని అందుకోవడానికి నేలకు దిగడం లేదు.... నేలన పడ్డ చేపల్ని పిల్లలూ, పెద్దవాళ్ళూ పోటీపడి పరిగెత్తి పెనుగులాడుతున్నారు....

ఆ 'ఓపెన్‌బర్డ్స్'ని చూడడానికి జనం తండోపతండాలుగా వస్తున్నారు. సంరక్షణకేమో వాచ్‌మెన్లూ వున్నారు. పక్షుల్ని కాల్చి చంపే వేటగాళ్ళూ వున్నారని, పెంట మీది రాలిన ఈకలు, పలికిన నెత్తురు మరకలు సాక్ష్యమిస్తున్నాయి.

మనసు కలుక్కుమంది.

**స్వేచ్ఛను హరించే హక్కు వీళ్ళకు ఎక్కడిది? నోరులేని పక్షులు నిలదియ్యలేవు. నోరు వుండీ తను నిలదీయగలుగుతోందా? నిలబడగలుగుతోందా?**

స్వేచ్ఛను హరించే హక్కు వీళ్ళకు ఎక్కడిది? నోరు లేని పక్షులు నిలదియ్యలేవు. నోరువుండీ, మనిషైవుండీ తను నిలదీయగలుగుతోందా? నిలబడగలుగుతోందా?

అప్పుడే వచ్చిన జీపు నా పక్కనే ఆగింది. తలెత్తి చూసాను. రఘురాం నవ్వు ముఖంతో జీపు దిగాడు.

"సారీ సులోచనగారూ!.... మిమ్మల్ని రమ్మని కబురుపంపి, ఇంతలో హెల్త్ సూపర్‌వైజర్ గారొస్తేను. ... అందుకే ఆయన్ని డ్రాప్ చేసి వచ్చేసాను" నా ముందు కొస్తూ అన్నాడు రఘురాం.

"అదేనా చెకింగ్ ఆఫీసరు డ్యూటీ?" అన్నాను.

"ఆc.... అహc.... అదేంకాదు, ముందిక్కడ అటెండన్సు వేసుకోకుండా డ్యూటీ చెయ్యడమేమిటీ?" రఘురాం ఛలోక్తికి, 'ఆహc....' అని మాత్రమే అనగలిగాను.

కొద్ది క్షణాలు మౌనం.

"ఏమిటీ.... ఇంట్లో ఏమయినా గొడవపడ్డారా మళ్ళీ?" మళ్ళీ రఘురామే అడిగాడు. లేదు' అన్నట్లుగా అడ్డంగా తలవూపాను.

"లోచనా! నాకింకా వారంలోజులే ఇక్కడ డ్యూటీ వుంటుంది. తరువాత హైదరాబాద్‌కి పోవాలి. ఈ వారం కూడా బిజీయే. సెప్టెంబరు, అక్టోబర్‌లలో వచ్చిన పక్షుల్లో చాలా పక్షులు చనిపోయాయి. కారణమేమిటో తెలుసా? ఆకలి! ఆకలి! అంతే..... అవి స్వేచ్ఛకోసం ఎక్కన్నుంచో ఇక్కడి కొచ్చాయి. కాని స్వేచ్ఛకంటే కూడా ఆహారం ముఖ్యమేమో కదూ?!..... కరువు వల్ల సరైన తిండి దొరక్కే ఇలా జరిగింది. అందుకే అవి తిరిగి సైబీరియాకు వెళ్ళిపోతున్నాయి..." రఘురాం చెపుతున్నాడు.

ఓపెన్ బర్డ్స్ వచ్చిన దారినే వెళ్ళిపోవడం నాకెందుకో జీర్ణించుకోవడం కష్టమయింది.



"..... అయితే అవి అలా చనిపోవడం.... కుళ్ళిన దేహాల దుర్గంధం వల్ల ఈ ప్రాంతాలలో జబ్బులొచ్చిన మాట కొంత వరకు వాస్తవమే. ఈ పరిసర ప్రాంతాల పిల్లలకు వాంతులు, విరోచనాలయి ఇద్దరు చనిపోవడం నీకు తెలుసు కదూ? దానిమీద రిపోర్టు పూర్తయింది. ఈ సారి ఈ పక్షులు సంత బొమ్మాళి మండలం గొదలాం, ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి, గ్రామాలవద్ద కూడా చేరాయి. వీటితో పాటు కొల్లేరు, నీలపట్టు, పులికాట్ ప్రాంతాలు చూసి రావాలి... ఈ వారమంతా కలియలేను...." క్షమించమన్నట్టు బాధగా చెప్పాడు.

మళ్ళీ నిశ్శబ్దం!

"మరి నే వెళ్ళిరానా?" అడిగేడు.

తలాడించాన్నేను.

"అదిగో అటుచూడు...." తుమ్మ చెట్టువేపు చూపించాడు. ఆ చెట్టు మీద పెలికాన్స్ మెడమీద ముక్కులతో రాసుకుంటూ ముద్దులాడుకుంటున్న దృశ్యం. చూస్తున్నంతలోనే నా చేతిని అందుకొని అరచేతిలో ముద్దుపెట్టాడు.

"వాళ్ళంతా నాకోసం చూస్తుంటారు, వస్తాను మరి.... " అంటూ వెళ్ళి జీపెక్కాడు. ఓ చేతితో స్టీరింగ్ పట్టుకొని, మరో చేత్తో చెయ్యివూపుతూనే వున్నాడు కనుమరుగయ్యేంతవరకూ.

రెండు క్షణాలు అలానే నిలబడ్డతర్వాత ఇంటికి బయలుదేరాను.

దారిలో చిన్నన్నయ్య కనిపించాడు. ఏదో చెప్పడానికే వచ్చినట్లున్నాడు. గొంతు సర్దుకొని "సులోచనా, .... ఈసారి నీ పనికి మేము అడ్డురాం.... కాని అంతవరకూ నీవు మమ్మల్ని వీధిలో పెట్టకు.... నలుగురూ మమ్మల్నే అంటున్నారు.... మమ్మల్ని అర్థం చేసుకో....." అన్నాడు అంతకన్న ఏమీ చెప్పలేనట్లు.

అన్నయ్య దేన్ని గురించి ప్రాధేయపడుతున్నాడో నాకర్థమయింది. కాని జవాబివ్వలేదు. అన్నయ్యకూడా ఏమీ మాట్లాడలేదు. నేను ముందుకు వెళ్తుంటే మళ్ళీ పిలిచాడు. ఆగి చూసాను. దగ్గరగా వచ్చి చేతులు పట్టుకున్నాడు. అటూ ఇటూ చూసాడు. "మా వల్ల మీ వదినల వల్ల తప్పుజరిగితే క్షమించు" చేతులు విడిచిపెట్టాడు. నా సమాధానాన్ని అందుకోకుండానే అక్కన్నుంచి గబగబా నడచి వెళ్ళిపోయాడు.

ఇల్లు చేరాక చూస్తే నాకు మరింత ఆశ్చర్యం వేసింది. వదినలిద్దరూ నా గదిలో దూరి నా సూట్‌కేసులో చీరలన్నీ సర్దారు. జాకెట్లు, లంగాలు మడతపెడుతున్నారు. నన్ను చూడ్డంతోనే తప్పుచేసిన దోషుల్లా తలలు దించుకు తమతమ గదుల్లోకి వెళ్ళిపోయారు. ఏమీ ఎరగనట్లు తుడిచిన ఇల్లే తుడుస్తున్నారు. పిల్లకి వేసిన జడలే వేస్తున్నారు.

వాళ్ళ ఇబ్బందిని గ్రహించి నా గది తలుపులు వేసుకున్నాను.

మంచం మీద చేరగల బడ్డాను.

"సులోచనా నువ్వెప్పుడు లేచిపోతావ్?" అని ఇంట్లోని ప్రతి చర్యా, ప్రతి మాటా, ప్రతి కదలికా ప్రతి ధ్వనిస్తున్నట్టేవుంది. చెవుల్లో హోరు. భరించలేక చెవులు మూసుకున్నాను. మెదడు నరాలు మెలితిప్పుతున్నాయి.

పక్కమీద అటూ ఇటూ దొర్లాను.

పక్క నలిగింది. లేచి సర్దాను. సర్దుతు

దశాబ్దాలు గడిచే కొద్దీ రాజకీయ, వైజ్ఞానిక, సామాజిక రంగాలన్నింటి పరివర్తనతో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ మార్పులన్నీ మనిషి జీవనగతిపై ఆలోచనా రీతిపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి.

సమాజంలో, మానవ జీవితంలో వచ్చిన మార్పులే రచయితల భావనలని, ఆలోచనా శక్తిని ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం మారుతుంది. సమస్యల స్వరూపం మారుతుంది. రచనా సంవిధానం మారుతుంది. ఏది మారినా మౌలికమైన సాహిత్యపు విలువలు, జీవితపు విలువలు మారవు. మారని ఈ విలువలున్న కథైనా, నవలైనా మరే ఇతర రచనైనా అది ఏ తరం రచయిత రచించినదైనా గానీ సాహిత్యాభిమానుల ఆదరణను చూరగొంటుంది. కాలాతీతమైన విలువల్ని ఆవిష్కరిస్తుంది. అందులో సందేహం లేదు. ఈ విలువల్ని ఎత్తిచూపే ప్రయత్నంలో భాగంగా ఈనాటి కథ కుల విలువైన రచనల్ని ఆహ్వానం మీకు అందిస్తోంది.

న్నప్పుడు వాసు గుర్తుకువచ్చాడు. ఎప్పుడూ వాసు పక్కని కూడదీసేవాడు, పోగులా వుంచేవాడు. అది తనకి ఇష్టపడేది కాదు. తను సర్దేది. అతను మళ్లీ కూడబెట్టేవాడు... తనకి విసుగొచ్చేది. కోపం వచ్చేది. పెనిమిటి భార్యాలన్నాక మల్లెలూ, పక్కా నలక్కుండా వుంటాయా? కొంటెగా అడిగేవాడు. కోపాన్ని పోకొట్టేవాడు. దగ్గరకు తీసుకొనేవాడు. లోకాన్ని మరిపించేవాడు.

అసలు వాసు తనకు మొదట ఇష్టం లేదు.

కాని వాసుకు మాత్రం తనంటే ఎప్పుడూ ఇష్టమే! వాళ్ళ అమ్మ, నాన్నలకూ ఇష్టమే. అందుకే బొప్పా మావయ్య చిన్నప్పటినుంచి 'మా కోడలు మా కోడల'ని ముద్రవేసారు. అమ్మానాన్నా అంతే! ఇద్దరన్నదమ్ముల తోడ మూడుతరాలకి మా ఇంట పుట్టిన మహాలక్ష్మివి నువ్వు అనే వాళ్ళు నాయినమ్మ, తాత. అటు పేగున వాడూ ఒక్కడే మనవడు. నీకు మొగుడు నిర్ణయించేసారు పెద్దలు.

అమ్మ చనిపోతూ వాసుబావని చేసుకోవమ్మా బ్రతిమలాడింది. బుగ్గయ్యాకే తనమెడలో వాసుబావ మూడుముడులూ వేసాడు. అమ్మ ఆత్మ సంతోషిస్తుందని సంబరపడిన నాన్నకూడా ఎన్నాళ్ళు బతకలేదు. పెళ్ళయిన మూన్నెళ్ళకే పోయాడు. అమ్మ అనారోగ్యానికి, తన పెళ్ళికి ఆస్తికరిగిపోగా అన్నయ్యలు దిక్కులేనోళ్ళయితే- ఇద్దర్నీ తెచ్చి ఇంట్లోపెట్టుకున్నాడు మావయ్య.

అమ్మానాన్నాలేక పోయినా అన్నయ్యలిద్దరూ తనతో ఒకే ఇంటచేరి తోడయినందుకు సంతోషిస్తే- వాసుకి క్షయరోగమొచ్చి మంచానపడితే ఇల్లూ పొలమూ అన్నయ్యలే చూసారు. అందుకు మామయ్య అంత దుఃఖంలోనూ కొంత సంతోషించాడు.

ఇప్పుడు క్షయరోగానికి మందులున్నాయని, భయంలేదని చెప్పినా- వాసూ మాత్రం పెళ్ళయిన ఏడాదికే ఒంటర్ని చేసి వెళ్ళిపోయాడు. ఆ దుఃఖంలో మామయ్య వున్న నాలుగెకరాల భూమి, ఇల్లు తనపేరున రాసి తమ్ముడు దగ్గరకు కలకత్తా వెళ్ళిపోయాడు

అంతంత చదువులకి అన్నయ్యలిద్దరికీ ఉద్యోగం రాలేదు. వచ్చే ప్రయత్నమూ చేయలేదు. అదే ఇంట్లో వుంటూ.... అదే నాలుగెకరాల భూమిని దున్నుతూ కాలాన్ని లాక్కొచ్చారు. ఆ మధ్యకాలంలోనే వారి పెళ్ళిళ్ళూ... కాపురాలూ.... పిల్లలూ.....

వాళ్ళ పచ్చటి కాపురాల మధ్య మోడులా తను ఒక్కర్తీ.... ఎన్నో వంటరి రాత్రులు భరించింది. తీరని కోర్కెలు దావానలంలా చుట్టి శరీరాన్ని స్పృశిస్తూ వుంటె కళ్ళ నీళ్ళు కుక్కుకుంది.

ఇలా ఎన్నాళ్ళు? ఎన్నేళ్లు?

ఇంతలో తలుపు చప్పుడయింది. వెళ్ళి తీసాను. ఎదురుగా వనజాక్షి! వస్తూనే ఆప్యాయంగా వదినా అంటూ చుట్టేసింది. పెద్దవదినా, చిన్నవదినా ఇద్దరూ వాళ్ళవాళ్ల గదులు దాటి ద్వారం దగ్గర నిలబడ్డారేగాని మా దగ్గరకు రాలేదు.

వనజాక్షి వాసూ వాళ్ళ పిన్ని కూతురు. నా వయసుపాటిదే వుంటుంది. పాతికకు ఒకటి రెండు సంవత్సరాలు అటుఇటుగ. వనజాక్షి ప్రస్తుతం నాలాంటి పరిస్థితుల్లోనే వుంది. భర్తపోలేదు. వున్నా లేనట్లే.... పెళ్ళాడిన వనజాక్షిని ఇంట్లో వుంచి చెప్పా చెయ్యక ఇళ్ళు వదిలి పోయాడు. ఎక్కడవున్నాడో.... ఏమయ్యాడో తెలీదు.

అప్పుడే అన్నయ్యలిద్దరూ వచ్చారు. వనజాక్షిని పలుకరించి ఊరివిషయాలు అడిగారు.

వనజాక్షి చెపుతూనే వుంది. పెద్దవదిన అందరికీ వడ్డించింది. ఇంతకు మునుపు నుండీ అంటే కొద్దిరోజులుగ నాకు భోజనం నా గదిలోకే వచ్చేస్తోంది. ఈ రోజు మాత్రం వనజాక్షి మూలాన అందరితో తినే అవకాశం కలిగింది. వదినలిద్దరూ ముభావంగానే వున్నారు. అన్నయ్యలిద్దరూ తలలాడిస్తున్నారు. వనజాక్షి మాట్లాడుతోంది.

"..... ఏం పంటలో ఏమోలే..... మన్ను నమ్ముకొని మన్నుతిన్నట్టుగే వున్నాది కాలం కాని కాలంలో ఈ వర్షాలేమిటి? ఒకటే జోకొట్టి కురుస్తోంది వాన మండిపోను వాన, కోసిన మళ్ళన్నీ నీళ్ళు నిండి ధాన్యమూ సాప్పా అన్నీ కుళ్ళిపోయినట్టుగున్నాయి..... పశువులకి గడ్డీ మిగుల్దు...

అవునూ సింహాచలం వున్నాడా?..... అన్నా కబురెట్టిమీ.... మిద్దెవానలకి పడిపోయింది,

ఆకాశం నిండా పెలికాన్స్ ఇంద్రధనస్సుల వెల్లువలా వెల్లివిరిసి, మబ్బుల్లా కదిలి చింత చెట్లమీద, సర్కారు తుమ్మ చెట్లమీద.... ఈ ప్రపంచమంతా వాటిదే అన్నట్లు.... గూళ్ళు నిర్మించుకుంటున్నాయి. కాపురాల్ని పండిస్తున్నాయి.... గుడ్లు పెడుతున్నాయి.... పొదుగుతున్నాయి.... పొదిగిన పిల్లలకి ఆహారంగా సముద్రతీరం నుంచి మెలకువగా పెద్దపెద్ద చేపల్ని తెస్తున్నాయి..... జారివేలకు పడ్డ ఆహారాన్ని అందుకోవడానికి నేలకు దిగడం లేదు.... నేలన పడ్డ చేపల్ని పిల్లలూ, పెద్దవాళ్ళూ పోటీపడి పరిగెత్తి పెనుగులాడుతున్నారు.

మెత్తించాలి. ... వాడ్ని తీసుకెళ్తాను...."

వనజాక్షి ఏం మట్లాడినా అందులోకి సింహాచలం వస్తాడు. అందుకే బ్రతుకు మీదబడ్డ సమ్మెట పోటు చెపుతున్నప్పుడూ సింహాచలాన్నే అడిగింది. ఎప్పుడూ సింహాచలం కూడా వనజాక్షి వస్తేనే కనిపిస్తాడు. లేదంటే మయమవుతాడు. వనజాక్షి కూడా సింహాచలాన్ని తనతో ఊరుతీసుకువెళ్తుంది. ఉంచుకుంటుంది. తిరిగి పంపిస్తుంది.

"పండుగ పోయాక సింహాచలంకి పెళ్ళట.... ఈ మధ్యే పెళ్ళి చూపులయి ప్రధానం కూడా అయిపోయిందట....." పెద్ద వదిన పులుసుతపేలాలోకి కళ్ళుపెట్టి చెపుతోంది.

"ఆc....." అని ఆశ్చర్యంగా ముఖం పెట్టి జరగకూడనిది జరిగినట్టు, వినకూడనిది విన్నట్టు నోటమాట రాలేదు వనజాక్షికి.

వనజాక్షి అచేతనంగా భోజనంలో చెయ్యి వేళాడేసెయ్యడం... ఎవ్వరూ గమనించకపోలేదు. అయినా వనజాక్షి వాళ్ళను పట్టించుకున్నట్టులేదు. మరి భోజనాలయినంతసేపు మాటలూలేవు.

భోజనాలయ్యాక నా గదిలోకి వనజాక్షి వస్తుంటే..... "ఊర్లో వున్నాడో.... లేదో... కబురు పెడతాన్లే..." పెద్ద అన్నయ్యే అన్నాడు.

ఆ మాట వనజాక్షికి కొద్దిగ తృప్తి ఇచ్చినట్లుగవుంది.

ఇద్దరం గదిలోకి వెళ్ళాం. వనజాక్షే తలుపు వేసింది. నా ముఖంలోకి చూడకుండానే మంచం మీద చేరగిలబడి తలగడలోకి తలదూర్చింది. నే పక్కనే కూర్చున్నాను. మా మధ్య మాటలు లేవు. నేనూ కదపాలని ప్రయత్నించలేదు. లేచి కళ్ళు తుడుచుకోబోయింది వశం కావడం లేదు. కళ్ళు నీటికుండలే! మళ్ళీ బోర్లా పడుకుంది. తలగడలోకి తల దూర్చింది. నేను ఆమె వీపు మీద చెయ్యి మాత్రమే వేసాను. మరొక్క మాటా మాట్లాడలేదు.

నేనుకూడ కాస్సేపటికి వనజాక్షి పక్కనే నడుం వాల్చాను.

నిశ్శబ్దం.... నిశ్శబ్దం.... నిశ్శబ్దం!

పగలుకీ రాత్రికీ తేడా లేదు....

ఈ నిశ్శబ్దాన్ని తను కూడా ఎంతగా భరించింది?!

పగలంతా పిల్లతోనూ, పనులతోనూ ఎలాగోలా గడిచిపోయేది. పొద్దుగూకి పక్క మీద కెక్కే శరీరం కట్టెలా ఎలా బిగుసుకుపోతుంది? ప్రాణమున్న మనిషి ఆకలి, నిద్ర, కామం, భయం ఇవేవి తీర్చుకోకుండా నిర్జీవంగా ఎలా జీవించగలదు? నిశ్శబ్దం ఒక్కటే స్పర్శించేది!

ఆ భయంకర రాత్రులనుండి బయటపడి తెల్లవారితే అన్నయ్యలూ, వదినలూ, ఇరుగు పొరుగూ అంతా చూపించేది జాలి మాత్రమే! ఆ జాలి దేన్నోపాతర వేస్తున్నట్టే వుంది... ఆ జాలిని ఛేదించగలిగితే?

వనజాక్షి బాగా అలసిపోయిందేమో, నిద్రలోకి జారుకున్నట్టువుంది.

ఆ జాలిని ఛేదించడానికి, కలిసి జీవించడానికి పెళ్ళి చేసుకుంటానని పెద్దలతో మరీ వచ్చాడు గోపాలం. అప్పటికి వాసుబావ పోయి రెండేళ్ళవుతుందేమో. అదే నేను మగాన్నయితే మరో మనువు చేసుకొని పిల్లల్ని కూడా కనివుందును! కాని ఆడదాన్ని.. తాళి తెగినా బొట్టు చెరపనందుకే చాలా నోళ్ళు ఆడిపోసుకున్నాయి. వాటిని మూయిస్తానని ముందుకొచ్చాడు గోపాలం.

"వీల్లేదు... సులోచనకి మళ్ళీ పెళ్లి చేయాలన్న తలంపు ఇప్పుడప్పుడే లేదు..." అన్న పెద్దన్నయ్య మాటలకు నాకు ఆశ్చర్యం వేసింది. ఆడపిల్లవారు.... అందునా మారు మనువుకి ఇంత తలబిరుసా?" అని కోపంతో అని, కోరిన కుర్రాన్ని తిట్టి వెళ్ళిపోయారు, ఆ పిల్లాడి అమ్మ, నాన్న మిగతా బందువర్గం.

"దాని బతుకు నిలబెడతానని, బంగారంలాంటి సంబంధమొస్తే వద్దన్నావేమిరా?" చుట్టపు చూపుగ వచ్చిన పెద్దమ్మ అడిగింది.

"నీకు తెలీదే, లోకం మారిపోయింది, ఆ గోపాలం వాళ్లు దేన్ని చూసి సులోచన్ని అడగడానికి వచ్చారో తెలుసా? దాని పేర్న వున్న భూమి, ఇల్లు సొంతం చేసుకుందామని.... అంతేకాని వాడేం ఆదర్శపురుషుడూ కాదు, జాలితోనూ కాదు...." నోరు మూయించేశాడు చిన్నన్నయ్య.

తనేమనుకుంది? ఇష్టపడి కట్టుకోవడం ముఖ్యంగాని.... ఆదర్శం పేరునో ఆస్తి పేరునో అయితే అవికలకాలం నిలబడతాయా? జాలి... జాలిలో దీనత్వంకంటే హీనత్వమే ఎక్కువవుతుంది రామురామా, అందుకే తనింకా ఏమీ మాట్లాడలేకపోయింది.

కాని పెద్దమ్మ మాత్రం ఊరుకోలేదు. దాని బతుకు బుగపడినప్పుడు ఈ భూములూ ఇల్లూ వుంటే ఎంత? పోతే ఎంత? అంది. అలాగని దాని బతుకు వదిలీడం ఏమి ధర్మం? అడిగింది.

"నీకు తెలీదు నోర్మూసుకో" కసిరేడు పెద్దన్నయ్య.

పెద్దమ్మ ఏదో గొణుగుతుంటే చిన్నన్నయ్య కళ్ళతోనే హెచ్చరించాడు.

తలుపు తట్టిన చప్పుడికి వనజాక్షి నిదురలోంచి లేచి వెళ్ళి, నాకంటే ముందే తలుపు తీసింది.

లక్ష్మి.... బడి వదిలేసినట్టున్నారు... బేగుతోనే వచ్చి నిలబడింది.

"ఏంరా చిన్నా....." అడిగాన్నేను.

"మరే... మరేమొచ్చి సింహాచలం అంకులు వున్నారట... రాత్రికి వస్తామని అన్నారట... నాన్న చెప్పమన్నారు...." చెప్పింది.

వనజాక్షి ముఖం విప్పారింది.

లక్ష్మి నుదిటన ముద్దుపెట్టుకుంది. లక్ష్మి సిగ్గుపడింది. నాకు నవ్వొచ్చింది. వనజాక్షికి ఆనందంగ వున్నట్టుంది. లేచి వెళ్ళి ముఖం కడుక్కుంది. అంతలోనే స్నానం చేసి చీర మార్చేసింది. పిల్లలకు కథలు చెప్పింది. కబుర్లు చెప్పింది. ప్రశ్నలు వేస్తే విసుక్కుంది.

చీకటి పడితే పిల్లకు ముద్దలు తినిపిం

---

అంతర్జాతీయ ఖ్యాతి నార్జించుకొన్న తెలుగు కథ ఈనాడు వ్యాపార విలువలకు బలైపోతున్నదని, మంచి కథలకు కొరత ఏర్పడుతున్నదని కథకులు, కథా వేదికల వారూ గొడవ పెట్టేస్తున్నారు. నిజమే కావచ్చు కానీ, కథకులు ఆర్థిక ప్రలోభాలకు, అర్థంలేని ప్రచారకాంక్షకు అమ్ముడుపోకుండా తమ నిజాయితీని నిలుపుకుంటూ సమాజం పట్ల ఆర్తితో, అవగాహనతో రాసే కథకుల కథలకు 'ఆహ్వానం' పలికే పత్రికలు లేకపోలేదనే విషయం ముందు గుర్తించి, ఇటువంటి పత్రికలకు తమ సహకారం అందించటం ద్వారా తమ వంతు బాధ్యతను నిర్వర్తించమని కోరుతున్నాం.

—ఎడిటర్

---

చింది. ముద్దులు పెట్టింది. పడుకోబెట్టింది. వనజాక్షిలో ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఇదేది చూడలేకేమో, అన్నయ్యలు ద్వారం దాటలేదు. వదినలు కూడా తలుపు తీయలేదు. టైము తొమ్మిది దాటలేదు. నేను నాగది దాటలేదు. చేరవేసిన తలుపులుకి గడియ కూడా వేయలేదు. పది దాటినా సింహాచలం రాలేదు. పన్నెండు దాటినా వనజాక్షి నిద్రపోలేదు.

అర్ధరాత్రి దాటిందని ఆశలన్నీ ఆర్పేసి, దీపమూ ఆర్పేసి నా పక్కనే వచ్చి పడుకుంది. మాటల్లేని నిశ్శబ్దం తప్ప! ఒకరిశ్వాస మరొకరికి పాముబుసలా వినిపిస్తోంది.

వనజాక్షి ఎంత ఆనందంగా గడిపింది ఇందాకటి వరకూ....?! ప్రతిరోజూ.... ప్రతి ఘడియా అలాగే గడపగలిగితే.....?!.... గడపాలంటే......?!....

తలుపు మీద చూపుడు వేళ్ళధ్వని...

వనజాక్షి ఒక్కసారిగ లేచి, పరుగున వెళ్ళి తలుపుతీసింది.

సింహాచలం వచ్చినట్లున్నాడు. అందుకే వనజాక్షి తిరిగి నా గదికి రాలేదు... నాకెందుకో తృప్తిగా అనిపించింది.

ఆ చీకట్లో కళ్ళు మూసుకున్నాను.

ఎందుకో వనజాక్షిని తలచుకుంటె అసూయవేసింది.

అన్నయ్యలూ, వదినలూ గుర్తుకు వచ్చి అసహ్యం వేసింది.

పెళ్ళికి అంగీకరించని వాళ్ళు.... ఆ పెళ్ళి అందించే 'శారీరక' సుఖాన్నే అందించడం, అంగీకరించడం ఏమిటి? స్వయనా కబురుపెట్టి పిలవడమేమిటి? దొంగ చాటుగ గుట్టూ, పరువూ, ప్రతిష్టాల కాపాడుకొనే తాపత్రయమేమిటి? నలుగుర్లోనూ తనముందుకు రాబోతే వీళ్ళేదనడమేమిటి?

అదే.... మనుషులు.... రఘురాంతో లేచిపోవడానికి అంగీకరించడమేమిటి? రేపు పరువూ ప్రతిష్టా పోదా? ఆ పోయిందేదో నాతోనే పోతుందనా?

ఆక్షణంలో ఏ ప్రశ్ననూ నాకు సమాధానం దొరకలేదు.

చాలసేపటివరకూ నిద్రకూడా పట్టలేదు.

తెల్లవారి లేచేసరికి వనజాక్షి ఎప్పుడు వచ్చి చేరిందో ఏమో నా పక్కనే పడుకొని వుంది. అప్పుడే లేచేటట్టులేదు.

ఎందుకో రఘురాం గుర్తుకొచ్చాడు.

ఇంకా ఎన్నిరోజులు....? లెక్కవేసుకున్నాను. రోజులన్నీ వేగంగా గడిచిపోతే బావుండుననిపించింది. లేచి కాలకృత్యాలన్నీ తీర్చుకొని వంటలోనూ, పనుల్లోనూ వదినలకు సాయపడ్డాను.

పదిగంటలకు వనజాక్షి లేచింది.

వనజాక్షి లేచాకే మళ్ళీ మాటలు ప్రారంభమయ్యాయి. నాకు రాత్రి విషయం గుర్తుకు వచ్చి తలదించుకున్నాను. అందురూ తలదించు కుంటారేమోననీ అనుకున్నాను కాని అంతా కలివిడిగా వున్నారు. కలసిపోతూన్నారు. రాత్రేమీ జరగనట్టే వున్నారు. మామూలుగానే వున్నారు. నాకాశ్చర్యం వేసింది.

సాయంత్రం పెలికాన్స్‌నీ, పెయింటింగ్ స్టార్క్స్‌నీ చూసొద్దామని వనజాక్షిని రమ్మంటే రానంది. నేనొక్కర్తినీ బయులుదేరాను. రఘురాం లేకపోవడంతో కాస్సేపు ఆ పక్షుల్ని చూసి ఇల్లు చేరుకున్నాను.

అప్పటికే చీకటి పడుతోంది.

ద్వారం లోపలికి అడుగు పెట్టబోతూ వుంటే 'సులోచన' అన్నమాట వినిపించి అలానే నిలబడ్డాను.

".... అయితే సులోచన వెళ్ళిపోతుందా?......"

"..... చెకింగ్ ఆఫీసరు రఘురాంతో......"

".... నాకేం నచ్చలేదు... వాడెవడో.... ఏమిటో..... అయినా అంత దూరం?..... ఏమిటో..."

"........................."

"వదినా, ఏమయినా గోపాలంకి సులోచనకిచ్చేయ్యవలిసింది."

"అదే నేనూ అన్నాను మీఅన్నతోటి....."

"నువ్వు నోర్మూసుకో, ఇప్పుడికి వంద దపాలు చెప్పాను.... ఆ సంబంధం చేస్తే మన కుటుంబాలు అడుక్కుతినార్సి వస్తుందని....."

"కాకపోతే ఏమిటి? ఈ ఇల్లూ, భూమి అన్నీ దాని పేర్న వున్నాయి. పెళ్ళయితే మనకి చిల్లిగవ్వ దక్కదు..."

అంతవరకూ అస్పష్టంగావున్న విషయమేదో స్పష్టమవుతూంది!

అక్కడ ఇంకొక్క క్షణం నిలబడలేక చీకటిలోకి వచ్చాను. అడుగులు ఎటూ పడలేదు. ఆలోచనలు మాత్రం పరిపరివిధాల పోతున్నాయి.

రఘురాం గుర్తొచ్చేడు.

రఘురాం మాటలు గుర్తుకొచ్చాయి.

పెలికాన్స్ స్వేచ్ఛకోసం..... ఆనందం కోసం.... అనంతంగా నమ్మి వచ్చినా, ఆహారంలేక ఆకలితో చచ్చిపోయాయి...... స్వేచ్ఛకంటే ఆహారం ముఖ్యమేమో కదూ?!

ఆ భుక్తి కోసమే తనకి విముక్తి లేకుండా చేస్తున్నారేమో? ఆ భూక్తిని.... ఆస్తిని..... వదిలి పెడితే? వాళ్ళకి భుక్తి!...... నాకూ విముక్తి!!

"సులోచనా...." పిలుపుతో వెనుదిరిగి చూసాను.

"ఏమిటీ నే ముందే వచ్చేస్తానని, ఊహించి దారికాసావా?" నవ్వుతూ రఘురాం.

నమ్మలేకపోయాను.

"ఏమిటీ అలా చూస్తున్నావ్.... నేనే, ఇన్‌చర్జి వచ్చాడు, నాకు రిలీవ్...... పద.... బంగళా దగ్గర వెయిట్ చేస్తుంటా నా చెయ్యిని తన చేతుల్లోకి తీసుకొని నొక్కి వదిలాడు. చీకట్లో కలసి పోయాడు.

ఇంటికి చేరి సూట్‌కేసు తీసుకు బయల్దేరుతుంటే వదినలూ, అన్నయ్యలూ, వనజాక్షి వచ్చి నిలబడ్డారు. నిద్దట్లో వున్న పిల్లల్ని ముద్దులాడాను.

"రఘురాం వచ్చాడు, వెళ్తున్నా...."నా మాట.

వాళ్ళెవరి నుంచి మాటల్లేవు.

అరుగుదాటుతుంటే "జాగ్రత్త సులోచనా..... ఎక్కడున్నా క్షేమంగా వుండు...." వదినలిద్దరూ పైటలు నోట్లో కుక్కుకుంటున్నారు. వనజాక్షి కళ్ళు తుడుచుకుంటోంది. సింహాచలం వచ్చినాళ్ళ పట్టించుకున్నట్టు లేదు.

"అమ్మాc...." అని మాత్రమే అనగలిగారు అన్నయ్యలిద్దరూ

వాళ్ళ కళ్ళల్లోనూ కన్నీరే!

నేకళ్ళు తుడుచుకుంటూ చీకట్లోకి వచ్చాను. రేపటి వెలుగు చూడాలంటే చీకట్లోనే నడక ప్రారంభం కావాలి అన్నట్లు రఘురాం టార్చిలైటు వేస్తున్నాడు. ఆ వెలుగులో దారిప్పుడు స్పష్టంగా వుంది.